భోజనానికి ముందు, తర్వాత టీ, కాఫీ వద్దు

- భారత వైద్య పరిశోధనా మండలి హెచ్చరిక
- మితంగానే వాటిని సేవించాలని సూచన

న్యూఢిల్లీ, మే 14: మనలో చాలా మందికి ఉదయం నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. ఇవి లేకపోతే ఎంతో మందికి పొద్దు గడవదు. కానీ, వీటిని మితంగా సేవించాలని, పరిమితికి మించి సేవిస్తే అనర్థాలు తప్పవని భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) స్పష్టం చేసింది. దేశంలో ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను ప్రోత్సహించేందుకు ఐసీఎంఆర్ ఇటీవల జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్ఐఎన్)తో కలిసి 17 సరికొత్త ఆహార మార్గదర్శకాలను జారీచేసింది. టీ, కాఫీని అధికంగా సేవిస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరించారు. వీటిలో ఉండే కెఫీన్ కేంద్ర నాడీ వ్యవస్థను ప్రేరేపించి టీ, కాఫీపై శారీరకంగా ఆధారపడే తత్వాన్ని పెంపొందిస్తుందని ఐసీఎంఆర్ పరిశోధకులు వివరించారు. మనం సేవించే ప్రతి కప్పు (150 మిల్లీలీటర్ల) బ్రూవ్డ్ కాఫీలో 80 నుంచి 120, ఇన్‌స్టంట్ కాఫీలో 50-65, టీలో 30-65 మిల్లీగ్రాముల కెఫీన్ ఉంటుందని పేర్కొంటూ..

రోజుకు 300 మిల్లీగ్రాముల కెఫీన్‌ను మాత్రమే తీసుకోవాలని సూచించారు. భోజనం చేయడానికి గంట ముందు, భోజనం చేసిన తర్వాత టీ, కాఫీ తాగకూడదని, లేకపోతే వాటిలోని టానిన్లు మన దేహంలో ఇనుము శోషణ శక్తిని తగ్గిస్తాయని తెలిపారు. దీంతో ఐరన్ లోపం ఏర్పడి రక్తహీనత లాంటి సమస్యలకు దారితీస్తుందన్నారు. కాఫీని ఎక్కువగా సేవిస్తే అధిక రక్తపోటు, గుండెకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. అయితే, పాలు లేకుండా టీ తాగడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడటంతోపాటు గుండె జబ్బులు, ఉదర క్యాన్సర్ ముప్పు తగ్గడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.

రక్త పరీక్షతో పాంక్రియాటిక్ క్యాన్సర్ నిర్ధారణ

న్యూఢిల్లీ, మే 14: రక్త పరీక్షతో పాంక్రియాటిక్ క్యాన్సర్ మొదటి, రెండో దశలను 97 శాతం కచ్చితత్వంతో నిర్ధారించవచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. లిక్విడ్ బయోప్సీ పరీక్ష ద్వారా రక్తంలో పాంక్రియాటిక్ క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యు పదార్థాలను కనిపెట్టవచ్చు. దీని ద్వారా సదరు వ్యక్తికి పాంక్రియాటిక్ క్యాన్సర్ ఉందా లేదా అని గుర్తించవచ్చు. పాంక్రియాటిక్ క్యాన్సర్ స్టేజ్ 1, స్టేజ్ 2 ప్రారంభ దశతో బాధ పడుతున్న వివిధ దేశాలకు చెందిన



వెయ్యి మందిపై అధ్యయనం చేశాక పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు.

ఐరాస వాహనంపై దాడి.. భారత మాజీ కర్నల్ మృతి

గాజాపై కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడులు

ఐరాస, మే 14: గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న వేళ రఫాలో ఐరాస వాహనంపై జరిగిన దాడిలో భారత మాజీ సైనికాధికారి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఐరాస సమగ్ర దర్యాప్తునకు, ఇజ్రాయెల్ వేరేగా ఒక దర్యాప్తునకు ఆదేశించాయి. మృతుడిని భారత ఆర్మీ మాజీ అధికారి కర్నల్ వైభవ్ అనిల్ కాలే(46)గా గుర్తించారు. ఆయన 2022లో ముందస్తు పదవీ విరమణ చేసి ఐరాస భద్రతా విభాగంలో రెండు నెలల కిందటే ఉద్యోగంలో చేరారని అధికారులు చెప్పారు. కాలే మృతికి ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ విచారం వ్యక్తం చేశారు.

ఎల్‌టీటీఈపై మరో ఐదేండ్లు నిషేధం

న్యూఢిల్లీ, మే 14: శ్రీలంకకు చెందిన లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) సంస్థపై విధించిన నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేండ్లపాటు పొడిగించింది. కేంద్ర హోంశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రజల్లో వేర్పాటువాద ధోరణిని పెంపొందించడం, ముఖ్యంగా తమిళనాడులో దేశ ప్రాదేశిక సమగ్రతకు ముప్పు కలిగించడంతోపాటు మద్దతు స్థావరాలను పెంచుకున్న ఎల్‌టీటీఈపై గతంలో విధించిన నిషేధాన్ని కేంద్రం పొడిగించింది. ఎల్‌టీటీఈకి భారత భూభాగంలో దానికి మద్దతుదారులు, సానుభూతిపరులు, ఏజెంట్లు ఉన్నారని హోంశాఖ పేర్కొన్నది.

ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటీకరణ

పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటన

ఇస్లామాబాద్, మే 14: ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన పాకిస్థాన్.. ప్రైవేటీకరణ బాట పట్టింది. నష్టాల్లో ఉన్న పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పీఐఏ) సహా ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటీకరిస్తున్నామని ప్రధాని షరీఫ్ ప్రకటించారు. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థల అమ్మకానికి సంబంధించిన ప్రణాళికను చేపట్టామని, వ్యాపారం, పెట్టుబడి అనుకూలమైన వాతావరణం తీసుకొచ్చేందుకు చేపట్టినట్టు ప్రధాని చెప్పారు.

'సేవా లోపం' పేరుతో లాయర్లపై కేసు వేయలేరు!

న్యాయవాదులు వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి రారు: సుప్రీం

న్యూఢిల్లీ, మే 14: వినియోగదారుల రక్షణ చట్టం కింద లాయర్లపై దావా వేసే విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. న్యాయవాద వృత్తి, లాయర్లు తమ క్లయింట్‌లకు అందించే సేవలు ప్రత్యేకమైనవని, వాటిని వినియోగదారుల రక్షణ చట్టం-1986 కింద ప్రశ్నించలేమని జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొన్నది. న్యాయవాద వృత్తిని ఇతర వృత్తులతో పోల్చలేమని అభిప్రాయపడింది. వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి లాయర్లు రారని, 'సేవా లోపం' పేరుతో లాయర్లపై కన్జ్యూమర్ కోర్టుల్లో దావా వేయలేరని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. నియమించుకొన్న సదరు లాయర్ అందించే సేవలు కేవలం 'వ్యక్తిగత సేవల' ఒప్పందానికి సంబంధించినవని, అందువల్ల అవి 'సర్వీస్' అనే నిర్వచనం నుంచి మినహాయించబడుతాయని కోర్టు పేర్కొన్నది. వినియోగదారుల రక్షణ చట్టం అనేది అన్యాయమైన వాణిజ్య పద్ధతులు, అనైతికమైన వ్యాపార విధానాల నుంచి పరిరక్షించేందుకు ఉద్దేశించిందని, వృత్తులను, వృత్తిదారులు అందించే సేవలను చట్టం పరిధిలోని తీసుకురావాలని చట్టసభ ఎన్నడూ ఉద్దేశించలేదని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా పేర్కొన్నది. జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ) 2007లో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలు న్యాయవాద సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

అప్పుడప్పుడు మద్యం సేవించినా ఆరోగ్యానికి చేటే

తాజా అధ్యయనాల వెల్లడి

న్యూఢిల్లీ: అప్పుడప్పుడు మద్యం తాగితే ఆరోగ్యానికి మంచిదేనన్న పాత అధ్యయనాలు తప్పని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం ఆల్కహాల్ విషపూరితం, క్యాన్సర్ కారకం, మానసిక ఆరోగ్యానికి ప్రమాదకరం. పేగు క్యాన్సర్, మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్ సహా ఏడు రకాల క్యాన్సర్లకు ఆల్కహాల్ కారణం. 2022లో జరిపిన ఒక పరిశోధన ప్రకారం తక్కువ మోతాదులో మద్యపానం చేసినా అధిక రక్తపోటు, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. తాజా అధ్యయనాలపై ముంబైలోని హెచ్‌సీఎల్ హెల్త్‌కేర్ జనరల్ ఫిజీషియన్ నజియా దాల్వియా మాట్లాడుతూ మద్యపానం వల్ల కాలేయ సంబంధ వ్యాధులు, స్థూలకాయం, సాంక్రమిక పాంక్రియాటిస్, టైప్ 2 డయాబెటిస్, అథెరోస్క్లిరోసిస్(రక్తనాళాలు గట్టిపడటం) వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

కుర్‌కురే తీసుకురాని భర్త.. విడాకులు కోరిన భార్య

ఆగ్రా: ఇటీవలి కాలంలో విడాకులు ఎంతగా అపహాస్యం అవుతున్నాయో చెప్పేందుకు ఇది తాజా ఉదాహరణ. భర్త తన కోసం కుర్‌కురే ప్యాకెట్ తీసుకురాలేదన్న కారణంతో అలిగి పుట్టింటికి వెళ్లిపోయిన భార్య విడాకులకు దరఖాస్తు చేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగిందీ ఘటన. ఆమెకు ప్రతి రోజూ కుర్‌కురేను చిరుతిండిగా తినడం అలవాటు. భర్త రోజూ రూ. 5 కుర్‌కురే ప్యాకెట్ తీసుకొచ్చి ఆమెను సంతోషపెట్టేవాడు. ఒక రోజు ఉత్తచేతులతో ఇంటికొచ్చిన భర్తను చూసిన భార్య వెంటనే పెట్టెబేడా సర్దుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనకు విడాకులు ఇప్పించాలని కోరుతూ ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు దంపతులిద్దరికీ కౌన్సెలింగ్ ఇప్పించాలని నిర్ణయించారు. ఇటీవలి కాలంలో ఇలాంటి చిన్న కారణాలతో విడాకులు కోరుతున్న వారి సంఖ్య బాగా పెరుగుతున్నది. పెళ్లయి 18 నెలలు అయినా భర్త తనతో గొడవపడడం లేదని, అతడి నుంచి తనకు విడాకులు ఇప్పించాలని యూపీ మహిళ అప్పట్లో కోర్టుకెక్కడం సంచలనమైంది.

ఘరానా విమాన చోరుడు అరెస్ట్

- 110 రోజుల్లో 200 విమానాల్లో ప్రయాణం
- లక్షల కొద్దీ సొత్తు అపహరణ

న్యూఢిల్లీ: అతడో ఘరానా విమాన దొంగ.కేబిన్ బ్యాగ్‌లో ఉంచిన ప్రయాణికుల లగేజ్ పక్కన తన బ్యాగ్ ఉంచి నైపుణ్యంగా చోరీలకు పాల్పడే వాడు. ఒకటి కాదు రెండు కాదు గత ఏడాది 100 రోజుల పాటు అలా 200 విమానాల్లో వేలాది కిలోమీటర్ల దూరం ప్రయాణించి నూతన తరహాలో యథేచ్ఛగా చోరీలు చేసిన రాజేశ్ కుమార్ అనే నిందితుడు ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులకు చిక్కాడు. నిందితుడి ఇంటి నుంచి పెద్దయెత్తున బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి ఢిల్లీ రైల్వే స్టేషన్ సమీపంలో రిక్కీ డీలక్స్ అనే మూడంతస్తుల గెస్ట్ హౌస్, రెండు వ్యాపారాలు ఉన్నట్టు గుర్తించారు. కేసు వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి ఢిల్లీకి విమానంలో ప్రయాణం చేసిన ఒక మహిళ తన హ్యాండ్ బ్యాగ్‌లోని ఏడు లక్షల విలువైన నగలు, అమెరికా నుంచి వచ్చిన ఒక వ్యక్తి తన కేబిన్ బ్యాగ్ నుంచి 20 లక్షల విలువైన వస్తువులు అపహరణకు గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పలు పుటేజీలు పరిశీలించి రాజేశ్ కపూర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, తన నేరాలు ఒప్పుకున్నాడు. సాధారణంగా కనెక్టింగ్ ఫ్లయిట్‌లను ఎక్కేవారి వద్ద పెద్దమొత్తంలో నగలు, ఖరీదైన వస్తువులు ఉంటాయని, అందుకే అవి ఎక్కే వృద్ధులు, మహిళలను టార్గెట్‌గా చేసుకునేవాడినని నిందితుడు తెలిపాడు. గతంలో రైళ్లలో ఇలాగే దొంగతనాలు చేసేవాడని పోలీసులు తెలిపారు.

జాబ్ మార్కెట్‌పై ఏఐ సునామీ!

- ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం ఉద్యోగాలు ఊడుతయ్
- రానున్న రెండేండ్లలో మారనున్న ఉపాధి పూర్తి స్వరూపం
- ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలినా హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 14: ఉద్యోగాలపై కృత్రిమ మేధ చూపనున్న ప్రభావంపై అంతర్జాతీయ ద్రవ్య సంస్థ(ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టలినా జార్జీవా హెచ్చరికలు చేశారు. జాబ్ మార్కెట్‌ను ఏఐ ఒక సునామీలాగా ముంచెత్తనున్నదని, రానున్న రెండేండ్లలో ప్రపంచవ్యాప్తంగా ఉపాధి మార్కెట్ స్వరూపాన్నే సమూలంగా మారుస్తుందని ఆమె పేర్కొన్నారు. గణనీయ సంఖ్యలో ఉద్యోగాలపై ఏఐ ప్రభావం పడుతుందని, అభివృద్ధి చెందిన దేశాల్లో 60 శాతం ఉద్యోగాలు పోతాయని, ప్రపంచ మొత్తంగా చూస్తే ఈ సంఖ్య 40 శాతం ఉంటుందని అన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేలా ప్రజలను సిద్ధం చేసేందుకు మనకు చాలా తక్కువ సమయం మాత్రమే ఉన్నదని, అయితే వ్యాపార సంస్థలు ఏఐ కోసం సిద్ధంగా ఉన్నాయని క్రిస్టలినా పేర్కొన్నారు. కృత్రిమ మేధకు పలు రంగాల్లో ఉత్పాదకత, సామర్థ్యాలను పెంచే శక్తి ఉన్నప్పటికీ, అయితే దాన్ని సక్రమంగా నిర్వహించుకోలేకపోతే తప్పుడు సమాచారం, సమాజంలో ఆదాయ అసమానతలు వంటి సమస్యలు పెరుగతాయని హెచ్చరించారు. మరోవైపు ప్రపంచంలో ఆర్థిక మాంద్యం లేదని అభిప్రాయపడిన ఐఎంఎఫ్ చీఫ్.. ఆర్థిక మాంద్యంపై గత ఏడాది తలెత్తిన ఆందోళనలను ఖండించారు. చాలా రీజియన్లలో ద్రవ్యోల్బణం రేటు కూడా తగ్గడం ప్రారంభమైనందని పేర్కొన్నారు. పర్యావరణ మార్పుల అంశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నిరంతర ముప్పుగా ఉన్నదని, ఈ విషయంలో ప్రస్తుత, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆమె అభిప్రాయపడ్డారు.

అధునాతన ఫీచర్లతో 'జీపీటీ-4వో'

శాన్‌ఫ్రాన్సిస్కో: ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ ఓపెన్ ఏఐ తమ ఏఐ మాడల్ చాట్‌జీపీటీలో 'జీపీటీ-4వో' పేరిట కొత్త వెర్షన్‌ను విడుదల చేసింది. దీన్ని త్వరలో అందరికీ ఉచితంగా అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపింది. అయితే దీని వినియోగానికి కొన్ని షరతులు ఉంటాయని, పెయిడ్ సబ్‌స్క్రైబర్లకు మాత్రం అవి వర్తించవని స్పష్టం చేసింది. 'జీపీటీ-4వో'లో అత్యాధునిక వాయిస్, టెక్స్ట్, విజన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. జీపీటీ-4 టర్బోతో పోలిస్తే కొత్త వెర్షన్ రెండు రెట్లు వేగంగా పనిచేస్తుందని, సబ్‌స్క్రిప్షన్ ధర కూడా సగానికి తగ్గుతుందని చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మీరా మురాటీ తెలిపారు. కొత్త మాడల్ తెలుగు, గుజరాతీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ సహా దాదాపు 50 భాషలను సపోర్టు చేస్తుంది. వాయిస్ కమాండ్లకు మనిషి తరహాలోనే కేవలం 232 మిల్లీ సెకండ్లలోనే సమాధానం ఇస్తుందని ఓపెన్‌ఏఐ తెలిపింది. మరోవైపు మ్యాక్ ఓఎస్ యూజర్లకు డెస్క్‌టాప్ యాప్‌ను విడుదల చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది. విండోస్ యూజర్లకు కూడా దీన్ని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపింది.

నవలఖాకు బెయిల్

న్యూఢిల్లీ, మే 14: మావోయిస్టులతో సంబంధముందన్న ఆరోపణలతో ఎల్గార్ పరిషత్ కేసులో అరెస్టయిన సామాజిక కార్యకర్త గౌతం నవలఖాకు సుప్రీం కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. అతని బెయిల్‌పై బాంబే హైకోర్టు విధించిన స్టేను పొడిగించడానికి నిరాకరించిన ధర్మాసనం అతనికి బెయిల్ మంజూరు చేస్తూ హౌస్ అరెస్ట్ కింద అయిన ఖర్చులు రూ.20లక్షలు చెల్లించాలని ఆదేశించింది. అరెస్టయ్యి నాలుగేండ్లు దాటినా అతడిపై ఇంతవరకు చార్జిషీటు నమోదు చేయని సంగతిని ధర్మాసనం గుర్తించింది.

భారత్‌పై ఆంక్షలు!

వాషింగ్టన్: ఇరాన్‌తో వ్యాపార లావాదేవీలు నిర్వహించే ఏ దేశమైనా తాము విధించే ఆంక్షలు ఎదుర్కొనే ప్రమాదం ఉన్నదని అమెరికా హెచ్చరించింది. ఇరాన్‌తో చాబహార్ పోర్ట్ నిర్వహణ ఒప్పందం నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షల కారణంగా చాబహార్ పోర్ట్ అభివృద్ధి మందగించింది. మధ్య ఆసియా, యూరప్‌తో వ్యాపార లావాదేవీలకు, సరకు రవాణాకు అనుకూలంగా ఉన్న ఈ పోర్టు నిర్వహణకు సహకరించడం ద్వారా వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని భారత్ భావిస్తున్నది.

హోర్డింగ్ కూలిన ఘటనలో 14కు చేరిన మృతులు

ముంబై: ముంబైలో హోర్డింగ్ కూలిన ఘటనలో మృతుల సంఖ్య 14కు చేరింది. ఈ ఘటనపై ఇగో మీడియా ప్రైవేట్ లిమిటెడ్ యాడ్ ఏజెన్సీ యజమాని భవేశ్ బిండేపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మంగళవారం ముంబైలో గాలివాన కారణంగా ఘట్‌కోపర్‌లో భారీ హోర్డింగ్ కూలింది. కాగా, అక్రమంగా హోర్డింగ్‌లు పెట్టినందుకు భవేశ్‌పై ఇప్పటికే 20 సార్లు జరిమానా పడినట్టు సమాచారం. అతడు ఓ రేప్ కేసులోనూ నిందితుడిగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.

చిత్రం

క్లైమాక్స్ ఘట్టాల్లో..

'దసరా' 'హాయ్ నాన్న' చిత్రాలతో వరుస విజయాలను సొంతం చేసుకున్నారు హీరో నాని. ప్రస్తుతం ఆయన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'లో నటిస్తున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్లైమాక్స్ చిత్రీకరణలో భాగంగా భారీ పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. సినిమాలో ఈ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు తెలిపారు. 'ఈ సినిమాలో నాని పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. కోపాన్ని క్రమపద్ధతిలో వాడుకుంటూ శనివారాలను మాత్రమే ముహూర్తాలుగా ఎంచుకొని శత్రువులను వేటాడే వ్యక్తిగా ఆయన పాత్ర కొత్త పంథాలో సాగుతుంది. ఆగస్ట్ 29న ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం' అని చిత్ర బృందం పేర్కొంది. ప్రియాంక అరుళ్ మోహన్, ఎస్.జే.సూర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి, సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: వివేక్ ఆత్రేయ.

షరతులు వర్తిస్తాయి

సినిమాలకు అంగీకరించే ముందు కథానాయికలు కొన్ని కండిషన్స్ పెట్టడం సహజమే. ముఖ్యంగా అగ్ర నాయికలు ఈ విషయంలో మరింత పట్టుదలతో ఉంటారు. బాలీవుడ్ అగ్ర కథానాయిక సోనాక్షి సిన్హా తెరపై బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి అస్సలు అంగీకరించదట. చిన్న ముద్దు సీన్ కూడా ఉండటానికి వీల్లేదని చెబుతుందట. కెరీర్ ఆరంభం నుంచి ఈ నియమాన్ని పాటిస్తున్నాని చెప్పుకొచ్చిందీ అమ్మడు. 'నా కెరీర్‌లో 30కి పైగా సినిమాలు చేశాను. ఇప్పటివరకు ఒక్క శృంగార సన్నివేశంలో కూడా నటించలేదు. బోల్డ్ సీన్స్ అస్సలు ఉండొద్దని దర్శకనిర్మాతలకు ముందే చెబుతాను. ఒకవేళ షూటింగ్ మధ్యలో అలాంటి సీన్స్ చేయాలని రిక్వెస్ట్ చేసినా ఒప్పుకోను. అవసరమైతే సినిమా నుంచి తప్పుకుంటాను కానీ అలాంటి దృశ్యాల్లో నటించడానికి దూరంగా ఉంటాను. ఈ నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదు. దర్శకనిర్మాతలు నేను పెట్టే కండిషన్స్‌కు అంగీకరించినప్పుడే సినిమాకు సైన్ చేస్తాను' అని చెప్పింది సోనాక్షి సిన్హా. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆమె నటించిన 'హీరామండీ' సిరీస్ ప్రస్తుతం అందరిని ఆకట్టుకుంటున్నది.

ప్రయోగాలతోనే ప్రయాణం

అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'పుష్ప-2' (ది రూల్) కోసం దేశవ్యాప్తంగా ప్రేక్షకులందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆగస్ట్ 15న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'పుష్ప' చిత్రంలో తాను పోషించిన స్మగ్లర్ పుష్పరాజ్ పాత్ర గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు అల్లు అర్జున్. స్మగ్లర్ పాత్ర అంటే నెగెటివ్ కోణంలో చూస్తారని, అయితే తన క్యారెక్టర్ ప్రభావం మాత్రం ప్రేక్షకులపై పడలేదని అల్లు అర్జున్ తెలిపారు. 'సుకుమార్ ఈ సినిమా కథ చెబుతూ స్మగ్లర్ పాత్ర అన్నప్పుడు అస్సలు టెన్షన్ పడలేదు. ఎందుకంటే ఒకప్పటితో పోలిస్తే ఎర్రచందనం స్మగ్లింగ్ బాగా తగ్గింది. పైగా కథానేపథ్యం కూడా 80వ దశకం లోనిది. అందుకే నా పాత్రను ఎవరూ స్ఫూరిగా తీసుకుంటారని అనుకోలేదు. ప్రేక్షకులు చాలా తెలివిగా ఆలోచిస్తారు. సినిమాను సినిమాలాగే చూస్తారు' అని అల్లు అర్జున్ పేర్కొన్నారు. నటుడిగా తాను ప్రయోగాలకు పెద్దపీట వేస్తానని, 'పుష్ప' వంటి గొప్ప కథా విస్తృతి వున్న పాత్ర ఇప్పటి వరకు రాలేదని, కమర్షియల్ చిత్రాల్లో కూడా నటుడిగా కొత్తగా ఆవిష్కరించునే ప్రయత్నంలో ఉన్నానని అల్లు అర్జున్ అన్నారు.

'వేట్టయాన్' షూటింగ్ పూర్తి

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 170వ చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్ కీలక పాత్రలను పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. అక్టోబర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ రిటైర్డ్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. వ్యవస్థలోని అన్యాయాలు, అక్రమాలపై ఆయన చేసిన పోరాటం ఏమిటన్నదే ఈ సినిమా కథాంశమని చిత్ర బృందం పేర్కొంది. కిషోర్, రితికా సింగ్, దుషార విజయన్, అభిరామి, రావు రమేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎస్.ఆర్.కతీర్, సంగీతం: అనిరుధ్ రవిచందర్, ప్రొడక్షన్ డిజైనర్: కె.ఖదీర్, రచన-దర్శకత్వం: టీజే జ్ఞానవేల్.

'బ్రహ్మచారి'కి ఆదరణ

మల్లేశం, స్వప్న జంటగా నటించిన 'బ్రహ్మచారి' చిత్రం ఇటీవలే విడుదలైంది. నర్సింగ్ దర్శకత్వం వహించారు. రాంభూపాల్ రెడ్డి నిర్మాత. తెలంగాణ నేపథ్యంలో ఈ సినిమా చక్కటి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటున్నదని చెప్పారు నిర్మాత రాంభూపాల్ రెడ్డి. ఆయన మాట్లాడుతూ 'విడుదలైన అన్ని చోట్ల మంచి స్పందన లభిస్తున్నది. గ్రామీణ ప్రాంతాలతో పాటు మల్టీప్లెక్స్‌లలో కూడా ఆదరణ బాగుంది. సమాజంలో బ్రహ్మచారులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలంగాణ నేపథ్యంలో వినోదాత్మకంగా చూపించాం. నిర్మాతగా తొలి ప్రయత్నంలోనే విజయం సాధించడం ఆనందంగా ఉంది. సినిమా చూసిన వారందరూ చక్కటి సినిమా చేశానని ప్రశంసిస్తున్నారు' అన్నారు.

పెళ్లి నేపథ్యంలో 'సంగీత్'

నిఖిల్ విజయేంద్ర సింహ, తేజు అశ్విని జంటగా నటిస్తున్న 'సంగీత్' చిత్రం మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. సాద్‌ఖాన్ దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి ఎస్.ఎస్.కార్తికేయ క్లాప్‌నివ్వగా, శౌర్య కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'పెళ్లి సమయంలో ఓ కుటుంబంలో జరిగిన సంఘటనలను వినోదాత్మకంగా చూపిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. ప్రేక్షకులను నవ్వించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. కామెడీతో పాటు కుటుంబ అనుబంధాలు ప్రధానంగా అందరిని మెప్పిస్తుంది' అన్నారు. ఈ సినిమాలో తాను సమర్థ్ అనే యువకుడి పాత్రలో కనిపిస్తానని, తన హృదయానికి ఎంతో దగ్గరైన చిత్రమిదని హీరో నిఖిల్ విజయేంద్ర సింహా తెలిపారు. విక్రమ్ శివ, సూర్య గణపతి, హర్ష చెముడు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్, నిర్మాణ సంస్థలు: లహరి ఫిల్మ్స్, ఆర్.బి.స్టూడియోస్, నిర్మాతలు: నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, స్రవంతి నవీన్, రచన-దర్శకత్వం: సాద్‌ఖాన్.

మాస్క్ వెనకున్న కథేమిటి?

'ప్రేమిస్తే' ఫేమ్ భరత్ నటిస్తున్న తాజా చిత్రం 'మిరల్'. ఎం.శక్తివేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సీ.హెచ్.సతీష్ కుమార్ నిర్మించారు. వాణి భోజన్ కథానాయిక. ఈ నెల 17న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశమిది. ట్రైలర్ అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. అందులో చూపించిన ఓ వింత మాస్క్ వెనకున్న కథమేమిటన్నది ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతున్నది. ప్రేక్షకులను ఆద్యంతం థ్రిల్‌కు గురిచేసే చిత్రమిది. హారర్ థ్రిల్లర్స్‌లో సరికొత్త పంథాలో తెరకెక్కించాం. తెలుగు ప్రేక్షకులను కూడా మెప్పిస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ బాలా, సంగీతం: ప్రసాద్ ఎస్ఎన్, నిర్మాణ సంస్థలు: విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, దర్శకత్వం: ఎం.శక్తివేల్.